# ప్రభప్రభాతము

శ్రీ బులుసు రామజోగరావు



ఈ కథానాయకుని పేరు అఖిలాండరాయుడు (నిఖిలదేవుడు, రెండవది ముద్దుపేరు. ఇతని వయసు రమారమి 19-వత్సరములుమాత్రమే. సీనియర్ బి-యె తరగతి విద్యార్థి జమీందారు—కళాశాలకు వేసవి విశ్రాంతి దినములు. అందుచేత తాను తన సంస్థాన రాజధానియగు తన జన్మభూమి పాలూరికి ఎస్టేటు వ్యవహారాలు చూచికొనుటకు వచ్చియున్నాడు. శలవుల ముగింపు రోజువరకు యూరిలోని స్నేహితులతో కులాసాగా వెళ్ళబుచ్చినాడు. కాలేజి తెరవబడి మరల కార్యక్రమము ప్రారంభింపబడినను నిఖిలదేవుడు, మరల నేలకో చదువుకొనుటకు మదరాసుపోక, ఆ వత్సరపు టాకురాల్పు కాలము వరకు కాలమునుగడపి, పిమ్మట పాలూరికి రమారమి 80-మైళ్ళదూరములోనున్న సుగంధపురమున కాపురమున్న తన మేనత్త కొక యుత్తరము వ్రాసెను. ఆమెయే యీతని తలిదండ్రులు గతించినవెనుక ఇతనిని పెంచి పెద్దజేసి విద్యాబుద్ధులింతవరకును నేర్పించిన మహాస్త్రీవ్యక్తి. ఈమెపేరు సుగుణాంబ. ఈమెకు ఈ దిగువ వ్రాయబడినతీరున జాబువ్రాసి మేనత్త క్షేమసమాచారములు తెలిసికొని నాడు మన కథానాయకుడు.

జాబు

నా ప్రియమైన అత్తమ్మగారికి మేనల్లుడు నిఖిల అనేక సాష్టాంగ దండప్రణామము లాచరించి వ్రాయు విజ్ఞాపనాపత్రము- నేను చదివిచదివి చాకలి కంటెను తక్కువవాడనైతినని విచారించుచున్నా

డను. నేనింత దనుకను నాపట్టణవాసులకుగాని, దేశములో అమిత కష్టాల పాలగుచున్న సోదరసోదరీ మణులకుగాని ఎవ్విధమైన సహాయమును చేసియుండలేదు. ఇందు తాతముత్తాతల (తరతరముల) కాలమునుండియు మావంశము కొనసాగుచు వచ్చుచున్నయది. నేనిపుడు బి. యే. పట్టమునంది 'పెద్దగుత్తాల పళ్ళుతోముటకా? - వలదు, వలదు. నేను బీదవారి సేవ సేయుటకే పుట్టియున్నాను. ఇది నా మనోనిశ్చయము. నీవు ఒకవేళ "వీనికి బాల్యము, ముక్కు పచ్చలారని పసికూనకు ఇంత విరక్తి, యెందుకని కోపపడినను సరియే. నాబుద్ధి మాత్రము మరిమారదు —— మంచివాడనిపించుకొని, జనులకు మంచిచేసి మరణించుట నాకడసారి మాట-మీరొప్పికొనినను, ఒప్పుకొనక పోయినను తప్పదు ప్రతిన-హరి, హర, హిరణ్యా గర్భుడేకమైనను నామదిలోని గుణము మరి మార్పజాలరు."

ఇకమీద-ఏలకోగాని యీఉత్తరమునకు అసలు ప్రత్యుత్తరమేలేదు ఆమె దగ్గరనుంచి. కొంతకాలమూరకుండి మరల నింకొక జాబు వ్రాయదొడగెను-నిఖిల తన మేనత్తకు. ఈదిగువ నుదహరింపబడిన విషయములే జాబులోని మాటలు:-

"నేను చదువుకొనుటకు పట్టణములలో పాదుకొనియుండ మొదలిడి నప్పటినుండియు మాయూరి (పాలేరి) పరిస్థితులు బొత్తిగాపాడయి, బీదసేద్యగానికి పరపతి పుట్టక, కార్మికులలో లక్షణాయని అన్నవస్త్రాలకు కాళ్ళు, మొగములువాచి, మలమల మాడుచుండు సంతతి దుర్భరముగ నున్నవి. కాబట్టి, ఈ ఘనకార్యమనగా బీదసాదల అన్నవస్త్ర సమస్యా పరిష్కారమునకు వర్తించు తీర్మానమును ఉపపాదించి బలపరిచి, సర్వజనాంగీకారమును బడయవలయుననియే నాదృఢనిశ్చయము. ఎన్నియో వత్సరములనుంచి సరిగా వర్షాలులేక పంటలు పండలేదు. మన మండలమునందు-ఏది యెటులుండినను యెవరెటు పోయినను సరియే, పన్నులుమాత్రము సరారునకు చెల్లింపక తప్పదుగదా, బీదరైతు వానికి! అప్పో సప్పోచేసి పన్నులు సవరించుకొను నుద్దేశముతో మార్వాడీవాని దగ్గరకువెళ్ళి; ఏమయ్యా! యీబంగారము నీయొద్దనుంచికొని కొంత పైకము ఇచ్చెదవాయని అడిగిన, నూటికి నూరు రూపాయలువడ్డీ- ఇష్టమైన తీసుకొనుడు, కష్టమైన పొండని బెదరింపుమాటలచే మరింత భయపెట్టుచుండును- ఇట్టి స్థితిలో పేదరైతు ఏలాగున తనపిల్లలతో గ్రామమున కాపురము చేయగలడు? ఇదియే నా ప్రస్తుత ధర్మసందేహము- వినుడు చెప్పుచున్నాను. రైతులకథ.

"మాయూరిలో పాలెపు సోమునాయుడు, ఆవాల-శోభినాయుడు అనువారిద్దరి కష్టములు. వారి కుటుంబాలు వ్యవసాయ జీవిత సముద్రములో మునిగి, తేలుచున్న-మరుపురాని మాయ సుఖ దుఃఖాలనే చిత్రపటములు చిత్రకారుడు చిత్రించి జీవకళపోసి స్వదేశవస్తు ప్రదర్శనశాలలకు నంపించినగాని సర్వజన సామాన్యులకు కనుపడవు. వ్యయసాయపుకష్టాలు "పై వారిద్దరును మచ్చుతునకలు. ఇంకను యిటువంటి కష్టజీవులు వేలకు వేలున్నారు. మాయూరి నిర్భాగ్య దశలో ఒక్కొక్కని కుటుంబమును వర్ణించి వ్రాయాలంటే అనంతశక్తి యుతుడగు ఆ చిత్రగుప్తునికికూడ సాధ్యముకాదు. దైవ భీతి గలవాడే రాజైనా, దాసుడైనా అసలు మనిషి. మదోన్మత్తులకు, స్వార్థపరాయణులకు, యీ తత్వము అగోచరము, పిల్ల, ముసలి, పిన్న, పెద్దలతో సహా కూడికొనియున్న అమాయక పట్టాదారులను దుర్భరమగు పన్నులతో కట్టివైచి, ప్రాతబకాయిలు, పరపతి సంఘాలలో తీసుకొన్న అప్పులు మొదలగు వానితో నోళ్ళుబిగించి యేమియు నీయజాలనివానిపై బట్టి నమ్మించి, కొందరి గుడిసెను ఏలమువేయించి, మరికొందరి దరిద్రుల దుక్కిటెడ్ల నమ్మించి నానా బాధల పాలుసేయుటెంతటి రాక్షసకృత్యమో సజ్జనులకు తెలియునా?

"ఘడియో క్షణమో, ప్రాణము పోవుచున్న వానికి సంధ్యావందన మనునట్లున్నది- నాదిశ్వవిద్యాలయము, పరీక్షలును. "తురకలుకొట్టగా చుక్కల కేదురా" ఈమహా కాటకములో, దరిద్రనారాయణుడు స్వేచ్ఛాపరతంత్రుడై దురభ్యాస పిశాచాలతో సామ్యవాద రణ రంగముపై స్వేచ్ఛాగీతాలు (songs-of liberty) పాడి ఆత్మగౌరవ మోహినీదేవిని గాఢముగ ఆలింగనము చేసికొనుచు ముక్తికాంతను పరిణయ మాడబోయిన యువకుమారులకు తిలతర్పణములు విడుచుచున్నాడు —— చూడండి! చూడండి!!

మాతృ పితృ స్థానాధి కారిణీ! మరల మరల భయాను మానములు నా యంత రాత్మలో దూరి,నన్ను పీల్చి పిప్పిచేయుచున్నవి- బీదసాదలకు ఉపకారము చేయుమని; కాన, నా పథము పూర్ణముగ మారి యనాథ సోదర సోదరీ భావ నారాధన మీదనే ఆడుచున్నది. అంత దనుక శాంతిలేదు నా హృదయమునకు. నాకులేని హక్కులను అతికించుకొని, అన్యాయమునకు కొంకక, జంకక, నా సోదర సోదరీ మణులను మోసపుచ్చి, బెదిరించి వారి చెమటచే నార్జింపబడిన అన్నము దినుటకంటె, విషము గ్రోలి మరణించుట మేలు. నిజము నిలకడమీద తేలును. వ్యవహార పరిపాక విపాకార్థము మనోగోచరమైన వెనుక, ఉద్యోగ సద్యోగాలు, ఊళ్ళు, పట్ట పరీక్షలు మొదలగు నిత్య కృత్యోప కర్మ సాధనాధికార రూపములు అక్కరలేదు ఆత్మవేత్తకు. కాన, నిలుకడయే కుకార్యములను దిద్దగలదు. "అటునుంచి నరుక్కో- రమ్మను మన్నాడట", ఆరు నూరైనను, నూరు ఆరైనను, నా సంకల్పమునకు విచ్ఛిన్నత రాజాలదు, రాదు కూడాను. అత్తమ్మా! ఈ యుత్తరము మాత్రము, మా పెద తాతగారికి (వ్యాసమూర్తిగారి) చూపింప వలదు- ఏలనన:——వారికి మొదటినుండియు నా అపూర్వ భావాలు, నడవడిక, అంటె కొంచెము యేవగింపు. పెద్దవాడని నేనును యింతవరకు వాని నెదిరించి యుండలేదు. ఇప్పుడు ఇంచుక భయము తీరినది గనుక నే మీకైనను యింతమాత్రము వ్రాయగలిగి యున్నాడను..."

ఇటుల వ్రాసిన ఉత్తరము చదువుకొని పాపము సుగుణాంబకు దుఃఖము వచ్చి యేడ్చినది యిక మీద యేమి చేయవలయునో తోచక. ఎట్టకేలకు ధైర్యము తెచ్చుకొని, ఒక పెద్ద చేట భారతమంత యుత్తరమగు జవాబు సంపమని, మరిమరి ముద్దారు మాటలతోను, మంచి మాటలు వినడేమోయని కళ్ళ బెదరింపు మాటలుతోను ముగింపున, బొలిబొల్లి బూకరింపుల మాటలతోను, తన అనంగీకారాన్ని తెలియజేసినది.

సుగుణాంబ తన మేనల్లునికి వ్రాసిన ఉత్తరము:-

నా ప్రియమైన నిఖిల దేవునికి ఆశీర్వాదములు. అబ్బాయీ! నీజాబులు రెండును చేరినవి- నీ వ్రాతలలో యెక్కడచూచినా ప్రేమసాగర తరంగపంక్తియే: ఏ యక్షరములో వెదకినను పవిత్రదేశ ప్రజా సేనాశయానురాగ లతాంకురాలే వెల్లి విరియుచున్నవి. "నీవు జేయదలచిన పని మంచిది కాదని కాని, అది నాకిష్టము లేదని కాని, చెప్పవలసినంత అగత్యమును నీబోటి చదువుకొన్న యువకుమారుల అనుమానములో, అప్రత్యక్షముగను,అవాఙ్మానస గోచరముగను తాండవ మాడించు ఏ యట్టి దానికి తగదని లోకులు చెప్పకొనక మానరు. మన కుటుంబమునకు పెద్దదానిని గనుక నున్నా, కాన ధర్మోపదేశము జేయుట తప్పని సరి యనిన్నీ, యింతగా చెప్పవలసి వచ్చినందుకు మాత్రము సంశయించుచునే యీజాబు వ్రాసి యుంటిని, శివాజ్ఞ అయిన దనిన్నీ, సర్వ జన సామాన్యుల జన్మ హక్కులకు సంబధించిన వారివారి కాయకష్ట ఫలమును, ఏమియు పనిచేయక, కూలబడి కుడులుపెట్టిన కూడు కుడుచుట, అధర్మమును, అన్యాయము అనిన్నీ నీవు నిశ్చయించుకొని, పిత్రార్జిత మగు మన జమీందారీని పాడు

చేయ చూచుచున్నాడవు, "తెలిసియో, తెలియకనో ఒకమారు పొరపాటొనరించిన మరల ఆతప్పు దిద్దుకొనుట బహుకష్టము- కాన, మున్ముందే జాగ్రత పడుట మంచిదని మొదటిదనియు తన కంటె అనుకొనుట భిన్న వ్యక్తులసుఖాల కాధార భూతములగు బహు ముఖార్థిక రూపరాసులను, పాడిపంటల మొత్తములును, స్వార్థిమై అనుభవించుచు తానే ప్రపంచములో సుఖపడ నిచ్చగించుటధర్మము లేదని అనుకొనుట అనేకమంది రైతులు దున్ని, సారవంతముచేసి వర్షాలు లేనపుడు తమ తమ చెమటనీటి కాల్వలతో పొలాలు తడిపి, పండించి భూఖావందునకు పాలిచ్చుచున్న తరి, ఆ హక్కులకు నేను తగనను కొను మెట్టవేదాంతము మూడవదనిన్నీ నీవను కొంటివి. కాని మూర్ఖ వేదాంతములు నీకు సన్యాస మిప్పించునేమోయని నాభయము. "తా బట్టిన కోడికి మూడుకాళ్ళ"ను నట్లు నీకు తోచినదే సత్యమా? నీ మొండివాదమే వేదాంత సూత్ర సారమా? అనుభవము లేని నీ మాటలు లోకులకు రుచింపవు, లోకులను ఆకర్షింపగల వాగ్ధోరణి గోపాల కృష్ణయ్యగారి వతు కలిగియున్న వాడ" ననియా నీ కిట్టి యలోచన పొడమినది? స్వభావముగనే నీకిట్టి యాలోచన జనించి యుండవచ్చును-కాని, మన వంశ మర్యాదలకు గీటు వెట్టగల యీ కొత్త పద్ధతి నాకు సరిపడలేదని నీకును తెలుసును.

హోదా, గౌరము, పలుకుబడి మొదలగున వన్నియును అధికారములో నిమిడి యున్నవి- అధికారము ధనములోను, ధనము, భూములలోను, భూములు మన స్వాధీనములోను అన్నంతవరకే మనకు రోజు. ఈకాస్తా పోతే ఎవరును నిన్ను, నన్ను లక్ష్యపెట్టరు- ఇక, రైతుల పేదరిక మంటావా? అది నీతరము, నాతరము కాదు- ఎవరి కర్మవా రనుభవింప వలసినదే- వారి దరిద్రము పోగొట్టగల వారెవరు? దేవుడే- సంఘ మర్యాదలు, అలవాట్లు, ఆలకింపులు, పలకరింపులు, గుసగుసలు, మొదలగున వన్నియును డబ్బులోనే డాగియున్నవి. చేతడి ఆరిన వెనుక యెవరును రారు సరిగదా నీ యింటికి, నాయింటికి, అసలు కనుపడినపుడు మాటలుకూడా ఆడరు-"తెప్పలుగ చెరువునిండిన;గప్పలు పదివేలు చేరుగదరా" అనునట్లు డబ్బులోనే లోకము- ఈ జిడ్డు కాస్త వదలగానే మనపాటు ఆ దేవునికే తెలియును- ఖబర్ దార్- నీకున్న తెలివితేటలు, కుశాగ్ర బుద్ధి, శాంతి ప్రేమ, హృదయ నైర్మల్యత, పవిత్రాశయములు, శక్తి వైరాగ్యాది సకల సద్గుణాలు భేరీ మ్రోగించి, మనమండల రాజధానియగు పాలూరి కోట బురుజులపై జయ పతాక నెత్తనిమ్ము- లేనిపోని వెకిలి మాటలు మాని, నంగివింగిరి వ్రాతలు పిల్ల చేతలు, కట్టిపెట్టి, రాచనాటి, మాటలు, మామూళ్ళు నేర్చుకొనుము. నీ వయసు శ్వాతముకాదు- చిన్నతనములో మనసు పరిపరి విధాల పయనము చేయుచుండును. అట్టి మనోప్రవాహ తరంగాలను చంపగల నేర్పు సంపాదించుటకు యిదే తరుణము- ఇప్పుడు, మెప్పులకు, అప్పులకు, రైతుల తిప్పలకు, పాటపడ నిశ్చయించుకొని, చదువు సంధ్యలు పాడుచేసికొనన నెంచితివో...నీవు పాడై పోవుటయే కాక, మన వంశ గౌరవమును కూడ పాడుచేసిన వాడవు కాగలవు అని ఉపదేశించుచు, నీ పార్థనకు నా యనంగీకారమును తెలియజేయుచున్నాను.

—సుగుణాంబ

(ఈ కథ టాల్‌స్టాయి మహా తత్వవేత్త తాలూకు కథల ననుసరించి వ్రాసినది.)